క్లుప్తంగా

కొవ్వూరు ఈవోపీఆర్ అండ్ ఆర్డీగా శర్మ



కేవీఎస్ఎస్‌యూఎం శర్మకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కొవ్వూరు: కొవ్వూరు ఈవోపీఆర్ అండ్ ఆర్డీగా కేవీఎస్ఎస్‌యుఎం శర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన దేవరపల్లి మండల పరిషత్ నుంచి బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఇప్పటి వరకూ కొవ్వూరులో పని చేసిన జి.సతీష్ కొయ్యలగూడెం బదిలీ అయ్యారు. కొత్తగా విధుల్లో చేరిన శర్మను మండలంలోని పంచాయతీ కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.ప్రసన్నకుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



రాజారావు మృతదేహంతో తోటి ఉపాధి కూలీలు

తాళ్లపూడి: ఉపాధి పని చేస్తుండగా గుండెపోటు రావడంతో కటారు రాజారావు (50) అనే కూలీ మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని మలకపల్లి పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. గుండెపోటు వచ్చిన రాజారావుకు తోటి కూలీలు సపర్యలు చేసి చికిత్సకు ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడని ఇన్‌చార్జి ఉపాధి ఏపీవో శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం నుంచి రాజారావు కుటుంబానికి సాయం అదేలా చర్యలు తీసుకుంటున్నామని ఏపీవో శ్రీనివాస్ తెలిపారు. రాజారావు మృతికి ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు సంతాపం తెలిపారు.

జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌కు ప్రీతి నాగశ్రీ



కొయ్యల ప్రీతి నాగశ్రీ

కొవ్వూరు: పట్టణానికి చెందిన కొయ్యల ప్రీతి నాగశ్రీ బాలికల అండర్ -19 జాతీయ స్కూలుగేమ్స్, వాలీబాల్ జట్టుకు ఎంపికైందని స్థానిక పీఏ స్వర్ అండ్ వీఎస్ డీపీవీ పాఠశాల ప్రిన్సిపల్ బి.నాగేంద్ర సోమవారం తెలిపారు. తమ పాఠశాల టెన్త్ విద్యార్థిని అయిన ప్రీతి నాగశ్రీ మధ్యప్రదేశ్‌లో భోపాల్‌లో ఈనెల 9 నుంచి 13 వరకూ నిర్వహించే జాతీయస్థాయి స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటుందన్నారు. ఈనెల 6 నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్ కూకట్‌పల్లిలోని డీపీవీ స్కూల్లో శిక్షణ అనంతరం జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళుతుందని తెలిపారు. ఈ ఏడాది జనవరిలో పంజాబ్‌లోని జలంధర్‌లో నిర్వహించిన డీపీవీ నేషనల్ గేమ్స్-2022లో జోన్-2 జట్టు (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) బంగారు పతకం సాధించిందన్నారు. ప్రీతి నాగశ్రీకి వాలీబాల్‌లో శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామోపాధ్యాయులు కె.జోగినాథం, బి.కళ్యాణిలను ప్రిన్సిపల్ నాగేంద్ర అభినందించారు. కాగా ప్రీతి నాగశ్రీ తండ్రి ప్రసాద్ వ్యాయామ ఉపాధ్యాయుడిగాను, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

కొవ్వూరు: జాతీయ రహదారిపై కాపవరం జంక్షన్ వద్ద ఆదివారం మోటార్ సైకిల్‌ను, వెనుక నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మండలంలోని పశివేదల గ్రామానికి చెందిన పెనమాకుల రాములమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. కొవ్వూరు రూరల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కొయ్యలగూడెం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన బావను చూసేందుకు రాములమ్మ ఈనెల 3న తన కుమారుడితో కలిసి మోటార్ సైకిల్‌పై వెళ్లింది. తల్లీకొడుకులిద్దరూ ఆ రాత్రి అక్కడే ఉన్నారు. ఆదివారం ఉదయాన్నే కుమారుడి మోటార్ సైకిల్‌పై స్వగ్రామం తిరుగు ప్రయాణం అయ్యారు. కాపవరం జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వచ్చిన కారు వారి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దాంతో వెనుక సీటుపై కూర్చున్న రాములమ్మ రోడ్డుపై పడిపోవడంతో బలమైన గాయాలయ్యాయి. ఆమెను కారులో రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై సతీష్ తెలిపారు.ఈ ప్రమాదంలో ఆమె కుమారుడు స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

సారా కేసులో ఇద్దరి అరెస్టు

తాళ్లపూడి: సారా కేసులో మండలం గజ్జరం గ్రామస్తులు ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. వారి వద్ద పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో నిందితులైన గజ్జరం గ్రామానికి చెందిన గండి మోహనరావు, చిక్కాల బాబూరావులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు.

డంపింగ్ యార్డు ప్రక్షాళనకు శ్రీకారం

- ఏళ్ల తరబడి నిల్వ ఉన్న పొడి చెత్త, ఇతర వ్యర్థాలు
- తరలింపునకు లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ సంసిద్ధం
- 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.3.50 కోట్లు కేటాయింపు
- త్వరలో పనులు ప్రారంభం



పట్టణ శివార్లలోని డంపింగ్ యార్డులో వ్యర్థాలు వేస్తున్న పారిశుధ్య కార్మికులు

నిడదవోలు: కొన్ని దశాబ్దాలుగా సమస్యగా మారిన పట్టణ శివార్లలోని డంపింగ్ యార్డు ప్రక్షాళనకు నిడదవోలు పురపాలక సంఘ పాలకవర్గం శ్రీకారం చుట్టింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు పట్టణంలో ఉత్పత్తి అయ్యే పొడిచెత్త, ఇతర వ్యర్థాల తొలగిస్తారు. అవసరాన్ని బట్టి డంపింగ్ యార్డు స్థలాలను పార్కుల నిర్మాణం, ఇతర అవసరాలకు వినియోగించుకొనేలా ప్రతిపాదనలే రూపొందించారు.

వేరు చేసి వ్యర్థాల తరలింపు

ఏళ్ల తరబడి ఈ డంపింగ్ యార్డులో నిల్వ ఉన్న వ్యర్థాలను లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా ప్లాస్టిక్, ఇనుము, గాజు, చెక్క, ఇసుక వంటి వాటిని వేరు చేస్తారు. ఈ మొత్తం ఈ ప్రక్రియను ప్రైవేట్ యాజమాన్యం చేపడుతుంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే ఇసుక, ఇతర మట్టిని మునిసిపాలిటీ పరిధిలోని పల్లపు ప్రాంతాలను మెరక చేసేందుకు వినియోగిస్తారు. ఇక ఇనుము, ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను యూనిట్ నిర్వాహకులే గుంటూరులోని జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలించుకుంటారు. దీనికోసం 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.3.50 కోట్లు కేటాయించారు. యార్డును పూర్తిగా ప్రక్షాళన చేశాక పట్టణంలో సేకరించిన తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేస్తారు. తడి చెత్తను ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికుల సాయంతో వర్మీ కంపోస్టుగా తయారు చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల యార్డు చుట్టుపక్కల నిర్వాసితులకు దుర్వాసన బెడద తప్పుతుంది. డంపింగ్ యార్డు పక్కన లెప్రసీ కాలనీ ఉంది. దీనిలో సుమారు 50 కుటుంబాలు నివశిస్తున్నారు. యార్డు నుంచే వచ్చే దుర్వాసన భరించలేక ప్రస్తుతం కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. యార్డులోని వ్యర్థాల తరలింపుతో వారికి ఉపశమనం లభించనుంది.

37,000 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు

పట్టణ శివార్లలోని నెహ్రూ నగర్‌లోని 4.56 ఎకరాల విస్తీర్ణంలోని డంపింగ్ యార్డులో ప్రస్తుతం 37,000 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు నిల్వ ఉన్నాయి. పట్టణంలోని 28 వార్డుల నుంచి రోజుకు 28 మెట్రిక్ టన్నుల చొప్పున వ్యర్థాలను యార్డులోకి తరలిస్తున్నారు. ఇందుకోసం మున్సిపాలిటీ 4 ట్రాక్టర్లు, రెండు కంపెస్టర్లు, రెండు జేసీబీలు, ఇక పర్మినెంట్ డ్రైవర్, నలుగురు కాంట్రాక్టు డ్రైవర్లు, 113 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా రెండు నెలల్లో పనులను పూర్తి చేసి వ్యర్థాలను గుంటూరులోని జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలిస్తారని అధికారులు చెబుతున్నారు. యార్డులోని మొత్తం వ్యర్థాలను తలించిన తరువాత ఆ స్థలాన్ని పురపాలక సంఘానికి అప్పగిస్తారు. అనంతరం మళ్లీ పట్టణం నుంచి సేకరించిన తడి,పొడి వ్యర్థాలను యార్డులో డంప్ చేస్తారు. తడి చెత్తను ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులచే వర్మీ కంపోస్టుగా తయారు చేయడానికి అధికారులు ప్రణాళిక తయారు చేస్తున్నారు.

ఆర్ఆర్ఆర్ కేంద్రాల ద్వారా ఘన వ్యర్థాల సేకరణ

పట్టణంలోని 13 వార్డు సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ కేంద్రాల ద్వారా ఘన వ్యర్థాల సేకరణను ముమ్మరం చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో మేరీ లైఫ్ మేరా సహర్ నినాదంతో సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు, పర్యావరణ కార్యదర్శులు రెడ్యూజ్, రీ యూజ్, రీసైక్లింగ్ (ఆర్ఆర్ఆర్) విధానంలో గృహాల నుంచి వ్యర్థాలను సేకరిస్తున్నారు. అలాగే ప్రజలు వినియోగించని దుస్తులు, పాత సామాన్లు, ఎలక్ట్రికల్ వస్తువులు, దుప్పట్లు, పాదరక్షలు, పరుపులు, ప్లాస్టిక్ వస్తువులను కూడా సేకరిస్తున్నారు. వాటిని ప్రతి వారం నాలుగు టన్నుల చొప్పున గుంటూరులోని జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలిస్తున్నారు.

క్లీన్ నిడదవోలు లక్ష్యంగా ..



డంపింగ్ యార్డులో ఏళ్ల తరబడి పేరుకుపోయిన వ్యర్థాలను లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా ప్రైవేట్ యాజమాన్యం తరలిస్తోంది. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడి చొరవతో క్లీన్ నిడదవోలుగా పట్టణాన్ని తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టాం. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. విద్యుత్తు సరఫరా, యంత్రాల ఏర్పాటు పూర్తయిన తరువాత మూడు రోజుల్లో ట్రయల్ రన్ ప్రారంభిస్తారు. పనితీరును పూర్తిగా పరిశీలించాక ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి చేతుల మీదగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.

– భూపతి ఆదినారాయణ, మున్సిపల్ చైర్మన్, నిడదవోలు

రేషన్ షాపులు, ఎండీయూ వాహనాలపై విజిలెన్స్ దాడులు

నలుగురిపై కేసులు



రేషన్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు

నల్లజర్ల: అనంతపల్లిలోని రెండు రేషన్ షాపులను, రెండు ఎండీయూ వాహనాలను జిల్లా విజిలెన్స్ అధికారి కె.కుమార్ ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. షాపులు, వాహనాల్లో ఉండాల్సిన రేషన్ స్టాక్‌లో వ్యత్యాసం ఉండడంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు పౌరసరఫరాల విభాగం డిప్యూటీ తహసీల్దార్ సుజాత విలేకరులకు చెప్పారు. షాపు నంబరు 42లో 29 బస్తాల 38 కిలోల బియ్యం, 50 కిలోల పంచదార, 55 కిలోల కందిపప్పు ఎక్కువగా ఉన్నాయి. ఈ సరుకు ఎండీయూ వాహనంలో ఉండాలి. అలాగే 43వ నంబర్ షాపులో 600 కిలోల బియ్యం, 50 కిలోల పంచదార, కందిపప్పు ఎక్కువగా ఉన్నాయి.ఈ సరుకు ఎండీయూ వాహనంలో ఉండాలి. ఈ వ్యత్యాసానికి బాధ్యులుగా నలుగురిపై కేసులు నమోదు చేసి డీలర్ షిప్‌లను సస్పెండ్ చేశారు. ఈ దాడిలో విజిలెన్స్ సీఐ రమేష్, తహసీల్దార్ విజయకుమార్, పౌరసరఫరాల విభాగం డిప్యూటీ తహసీల్దార్ సుజాత, వీఆర్వోలు శ్రీనివాస్, రామారావు, వీఆర్ఏ సత్యనారాయణ పాల్గొన్నారు.



నల్లజర్లలో గడప గడపకూ.. నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీ భరత్‌రామ్

పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి

- ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే తలారి
- నల్లజర్లలో కొనసాగుతున్న గడప గడపకూ..

నల్లజర్ల: గడప గడపకూ సంక్షేమం అందేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. నల్లజర్ల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పదో రోజు సోమవారం ఉత్సాహంగా సాగింది. ఎంపీ, ఎమ్మెల్యేలు ఇద్దరూ వైఎస్సార్ సీపీ శ్రేణులు, అధికారులతో కలసి గ్రామంలోని తిరుమల టౌన్ షిప్, ఎస్సీ కాలనీలకు వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఏదో ఒక పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చిందని ఈ సందర్భంగా వారన్నారు. భవిష్యత్తులో కూడా ఈ పథకాలన్నీ సక్రమంగా అందాలంటే జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

చెరువు ముంపు నుంచి కాపాడండి

వర్షాకాలంలో ఎగువ ప్రాంతం నుంచి నల్ల-ఎర్ర చెరువుకు వచ్చే వరద నీరు తమ ప్రాంతాన్ని ముంచెత్తుతోందని అక్కడి ప్రజలు ప్రజా ప్రతినిధులకు వివరించారు. రెండు చెరువుల మధ్య కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరారు. కల్వర్టు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ఎమ్మెల్యే తలారి ప్రకటించారు. అక్కడి నివాసితురాలైన సంగమేశ్వర శ్యామల ముఖంపై సూరీడుకాయలతో ఉండడాన్ని గమనించిన ఎంపీ భరత్ ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే ఎంపీ రాజమహేంద్రవరంలోని చర్మవ్యాధుల డాక్టర్‌తో ఆమె వ్యాధి విషయమై మాట్లాడారు. మంగళవారం రాజమహేంద్రవరం ఆసుపత్రిలో ఆమె వైద్యానికి ఎంపీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి జ్యోతి, ఉప సర్పంచ్ రాయుడు విజయకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు మేణ్ని వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు, ద్వారకాతిరుమల ట్రస్టు బోర్డు మెంబరు అనసూయ, లైటింగ్ పండు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ఇంటి వద్దకే పథకాలు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ఉండ్రాజవరంలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవనాల ప్రారంభం



ఉండ్రాజవరంలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాక అర్హుల ఇంటి వద్దకే జాప్యం లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఉండ్రాజవరంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.64.50 లక్షల వ్యయంతో నిర్మించిన మూడు రైతు భరోసా కేంద్రాల భవనాలను, రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడారు. ఇప్పటి వరకూ రూ. 4.07 కోట్ల వ్యయంతో ఉండ్రాజవరం గ్రామంలో రోడ్లు, డ్రైన్‌లు, నూతన భవనాలు వంటి అభివృద్ధి పనులు చేశాన్నారు. గ్రామంలో రూ.36 కోట్ల వ్యయంతో పాఠశాలలను అభివృద్ధి చేశామని చెప్పారు. అలాగే జలజీవన్ మిషన్ కింద రూ.6.50 కోట్ల వ్యయంతో రక్షిత మంచినీటి ట్యాంకుల నిర్మాణం, ఇంటింటికి కుళాయి పైపులైన్ పనులు ప్రారంభించామన్నారు. సమస్య ఎలాంటిదైనా తాను అండగా ఉంటూ ఉండ్రాజవరం గ్రామాభివృద్ధి ప్రత్యేకంగా కృషి చేస్తున్నానన్నారు. గత టీడీపీ పాలనలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుతో పాటు టీడీపీ నాయకులు మాఫియాగా తయారై ప్రజలను దోచుకున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. పేదలకు సెంటు భూమిని కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. కార్యక్రమంతో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, సర్పంచ్ మెండె వెంకట్రావు, వైస్ ఎంపీపీ నరహరశెట్టి సరోజిని, కరెళ్ళ వెంకట సూర్యమంగాదేవి, గాడి కృష్ణఘర్, సంకురాత్రి సుబ్బారావు, బూరుగుపల్లి భాస్కరరావు, విశ్వాసరావు తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు స్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్



చాగల్లు పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ట్రైనీ ఐపీఎస్ పంకజ్‌కుమార్ మీనా

చాగల్లు: ట్రైనీ ఐపీఎస్ అధికారి పంకజ్ కుమార్ మీనా సోమవారం సాయంత్రం చాగల్లు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.ఈ స్టేషన్లోని లాకప్‌ను, రికార్డులను పరిశీలించారు. స్టేషన్ నిర్వహణకు సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఉన్న కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ ఐపీఎస్ ట్రైనింగ్‌లో భాగంగా చాగల్ పోలీసు స్టేషన్‌ను పంకజ్ కుమార్ మీనా సందర్శించారన్నారు. చాగల్లు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లిపాడు ఇసుక ర్యాంపులో లోడింగ్ వివాదం



బల్లిపాడు ఇసుక ర్యాంపులో నిలిచిపోయిన ఇసుక లారీలు

తాళ్లపూడి: ఇసుక లోడింగ్ విషయమై బల్లిపాడు ఓపెన్ ఇసుక ర్యాంపులో సోమవారం సాయంత్రం లారీ డ్రైవర్లకు, ఇసుక రీచ్ నిర్వాహకులకు మధ్య వివాదం తలెత్తింది. రెండు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడంతో దాదాపు మూడు గంటల పాటు ఇసుక లారీలు ర్యాంపులో నిలిచిపోయాయి. తడి ఇసుక లోడింగ్ చేయడంతో బరువులో తేడా వస్తోందని లారీ డ్రైవర్ల వాదన. 18 టన్నుల ఇసుక లారీకి 20 టన్నులు వేసేవారని, కాని ప్రస్తుతం 20 టన్నుల ఇసుకకు బిల్లు చెల్లించాలని చెప్పడంతో లారీ డ్రైవర్లు అభ్యంతరం చెబుతున్నారు.

అతిసార పక్షోత్సవాలు ప్రారంభం

నల్లజర్ల: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఈనెల 5 నుంచి 17 వరకూ అతిసార వ్యాధి నివారణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు డాక్టర్ మహమ్మద్ సిరాజుద్దీన్ సోమవారం చెప్పారు. మే, జూన్ నెలల్లో ఐదేళ్ల లోపు పిల్లలు ఎక్కువగా అతిసార వ్యాధి బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. వాటి నివారణకు చేపట్టిన ఈ పక్షోత్సవాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు.

ఫ్యాక్టరీ ఏర్పాటుపై సగ్గొండలో గ్రామసభ

గోపాలపురం: సగ్గొండ పంచాయతీ పరిధిలోని గోపవరంలో తలపెట్టిన సీఎస్‌డీ ల్యాబ్ నిర్మాణంపై స్థానికులు తమ అపోహలను నివృత్తి చేసుకోవాలని దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు అన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణంపై సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు అధ్యక్షతన సగ్గొండ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం గ్రామసభ నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సంయమనం పాటించాలన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, పంచాయతీ తీర్మానం కూడా చేశామని సర్పంచ్ శేఖర్‌బాబు చెప్పారు. ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా యాజమాన్యం జాగ్రత్తలు పాటిస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలతో పాటు పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని సర్పంచ్ వివరించారు. కార్యదర్శి కె.అనురాధ, పంచాయతీ వార్డు సభ్యులు, గోపాలపురం, దేవరపల్లి ఎస్ఐలు కె. రామకృష్ణ, కె. శ్రీహరి పాల్గొన్నారు.

'స్పందన'కు వినతుల వెల్లువ

నల్లజర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. తాను కొత్తగా ఇల్లు నిర్మించుకుంటే తనకు గతంలోనే రుణం మంజూరు చేసినట్టు గృహనిర్మాణ శాఖ వారు చెబుతున్నారని దూబచర్లకు చెందిన దేవరకొండ పాప ఫిర్యాదు చేసింది. తాము ప్రభుత్వానికి ధాన్యం తోలి నెల రోజులు పైబడినా ఇంకా సొమ్ములు జమ కాలేదని జగన్నాథపురం రైతులు గుదే వెంకట్రావు, మామిడిపల్లి రామచంద్రం,వెంకటేశ్వరరావు, చక్రధరరావు అర్జీ అందజేశారు.

మొక్కల సంరక్షణతోనే మానవాళికి రక్ష



కొవ్వూరులో గిఫ్ట్ ప్లాంట్స్‌తో డిగ్రీ కళాశాల విద్యార్థినులు



నిడదవోలులో మొక్క నాటుతున్న సీనియర్ సిటిజన్లు



అనంతపల్లి హైస్కూలో హెచ్‌ఎం రామారావు ఆధ్వర్యంలో..

కొవ్వూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, మొక్కలను విరివిగా నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు సూచించారు. కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జన్ భగీరథి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈనెల 15 వరకూ వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టనున్నట్టు సిల్క్ హబ్ కో-ఆర్డినేటర్ ఎస్.సస్య తెలిపారు. విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.

ఆంధ్రా షుగర్స్ కార్మికులు, సిబ్బంది ర్యాలీ

పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆంధ్రా షుగర్స్ కర్మాగారంలో సోమవారం ఉద్యోగులు, కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కర్మాగారం ప్రాంగణంలో సిబ్బంది మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోరుతూ ప్ల కార్డులు పట్టుకుని ర్యాలీ చేశారు. కర్మాగారం యార్డు స్థలంలో మానవ హారంగా ఏర్పడి నినాదాలు చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. కర్మగారం జనరల్ మేనేజర్ ఈవీ కృష్ణారావు, భద్రతా అధికారి కేవీవీ సత్యనారాయణమూర్తి, ల్యాబొరేటరీ ఇన్‌చార్జ్ త్రినాథరావు, హెచ్ఆర్ మేనేజర్ సీహెచ్ సుఖమహర్షి, కెమిస్ట్ ఆలపాటి దుర్గా నవీన్ పాల్గొన్నారు.



కొవ్వూరులో ప్ల కార్డులతో ర్యాలీకి బయలుదేరుతున్న ఆంధ్ర షుగర్స్ ఉద్యోగులు, కార్మికులు

నిడదవోలు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిడదవోలులో సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు అడపా సూర్యచంద్రరావు, సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కొండ నిర్మల, సంఘ కార్యదర్శి ఆరుగొళ్ళు వెంకటేశ్వర్లు, పొన్నా సుబ్రహ్మణ్యం, గొన్నాబత్తుల రామారావు, ముంగండి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: అనంతపల్లి హైస్కూల్ ఆవరణలో హెచ్‌ఎం ఎం.రామారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు.